E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

02-04-2025 బుధవారం | పేజీలు–6 | హైదరాబాద్

ekaburu.com



2లో

## మూడు నెలలు మండుటెండలే

## హెచ్‌సీయూ భూమి.. ఒక్క అడుగు కూడా ప్రభుత్వం తీసుకోదు: మంత్రి శ్రీధర్‌బాబు



2లో

## విద్యార్థుల ఆందోళన.. హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత



2లో

## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. మంత్రులతో చర్చించిన సీఎం రేవంత్‌రెడ్డి

**కంచ గచ్చిబౌలి పరిధిలోని భూముల వ్యవహారం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో ఆందోళనలు, తాజా పరిణామాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు.**

**హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి పరిధిలోని భూముల వ్యవహారం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో ఆందోళనలు, తాజా పరిణామాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ప్రస్తుత పరిస్థితులపై అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం చర్చించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో సీఎం

తరువాయి 2లో



## మరోసారి సీఎం రేవంత్ రెడ్డి

# ఢిల్లీ పర్యటన

- బీసీలకు 42%రిజర్వేషన్ కోసం మద్దతు రాబట్టడం
- పాలకుల, పార్టీ నాయకుల సంఘటనం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన లక్ష్యం
- బీసీ రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటులో మద్దతు సాధన
- తెలంగాణ అసెంబ్లీ బిల్లు ఆమోదం
- బీసీ సంఘాలు ఢిల్లీలో మహాధర్నా నిర్వహణ
- రాజ్యాంగం 9వ షెడ్యూల్లో బీసీ రిజర్వేషన్లను చేర్చడం

2లో

## ఏప్రిల్ 27న 10 లక్షల మందితో

# రజతోత్సవ మహాసభ: కేసీఆర్

- 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు: కేసీఆర్ పిలుపు
- ఎండాకాలంలో ప్రజల కోసం ప్రత్యేక ఏర్పాట్లు: 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు, నీళ్ళు
- ఎల్కతుర్తి: 154 ఎకరాల్లో రజతోత్సవ సభ ప్రాంగణం ఏర్పాట్లు
- పార్కింగ్ కోసం 1,059 ఎకరాలు కేటాయింపు, 50 వేల వాహనాలకు స్థలం
- ప్రత్యేక రాష్ట్రోద్యమ సెంటిమెంట్: వరంగల్‌లో ఏప్రిల్ 27న బీఆర్ఎస్ రజతోత్సవం




**ఏప్రిల్ 27న కనీవినీ ఎరుగని విధంగా రజోత్సవ మహా సభను నిర్వహిస్తామని భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా ముఖ్య నాయకులకే బీఆర్ఎస్ బాస్ సమావేశం అయ్యారు.**

**10 లక్షల మందితో.. కనీవినీ ఎరుగని విధంగా రజతోత్సవ మహాసభ.. కేసీఆర్**

ఏప్రిల్ 27న కనీవినీ ఎరుగని విధంగా రజతోత్సవ మహా సభను నిర్వహిస్తామని భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ అన్నారు. మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నాయకులకే బీఆర్ఎస్ బాస్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సభ నిర్వహణకు సంబంధించి వాళ్లతో మాట్లాడారు. 10 లక్షల మంది తరలిరానున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు కేసీఆర్. wఎండాకాలం కావడంతో రజతోత్సవ సభకు హాజరయ్యే వాళ్లకు

తరువాయి 2లో



## 400 ఎకరాలు సాధించడం ఈ ప్రభుత్వ విజయం..

# రాష్ట్ర ప్రజల విజయం: భట్టి విక్రమార్క

- భట్టి విక్రమార్క ధ్వజమెత్తిన కంచ గచ్చిబౌలి భూముల వివాదం
- ప్రజల ఆస్తిని రక్షించడం: 400 ఎకరాల భూమి తిరిగి పొందడంలో ప్రభుత్వ విజయాలు
- హెచ్‌సీయూ భూముల కేటాయింపు: గత ప్రభుత్వ చర్యలు మరియు ప్రభుత్వ పోరాటం
- భారీగా ఉపాధి అవకాశాలు సృష్టించడం: ప్రభుత్వ లక్ష్యాలు
- ప్రకృతి పరిరక్షణపై పర్యావరణ ప్రశ్నలు: మంత్రి పొంగులేటి కౌంటర్

2లో

అబద్ధాల మీదే బతుకుతున్న కొన్ని రాజకీయ పార్టీలు కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో అడ్డగోలుగా వ్యవహరిస్తూ దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు.



3లో

### కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. పార్లమెంట్‌లో లేవనెత్తిన తెలంగాణ భాజపా ఎంపీలు



3లో

### ఆ భూముల అమ్మకాలతో రూ. కోట్లు దండుకోవాలను కోవడం దుర్మార్గం: బండి సంజయ్

## వక్ఫ్ (సవరణ)బిల్లుపై చర్చలో పాల్గొంటాం..కానీ!:

# విపక్ష పార్టీలు కీలక నిర్ణయం

**వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును బుధవారం కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు సిద్ధమైన వేళ 'ఇండియా' కూటమి పార్టీల కీలక సమావేశం నిర్వహించారు.**

**ఈ-కబురు,ఢిల్లీ:**
వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును బుధవారం కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు సిద్ధమైన వేళ 'ఇండియా' కూటమి పార్టీలు కీలక సమావేశం నిర్వహించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు సమాచారం. ఈ సాయంత్రం ఢిల్లీలో జరిగిన భేటీలో కాంగ్రెస్, శివసేన (యూబీటీ), సీపీఎం సహా పలువురు విపక్ష పార్టీలకు చెందిన నేతలు సమావేశమై లోక్‌సభలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ బిల్లుపై చర్చలో క్రియాశీలంగా పాల్గొనాలని, కానీ.. వ్యతిరేకంగా ఓటేయాలని నేతలు నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ భేటీ అనంతరం లోక్‌సభలో ప్రతిపక్షాలు చర్చలో


తరువాయి 3లో





3లో

### చిలీని అంటార్కిటికాకు గేట్‌వేగా చూస్తున్నాం: ప్రధాని మోదీ



3లో

### బ్యాంకాక్‌లో భూవిలయం.. ఆ భవన శిథిలాల కింద 300 మంది కార్మికులు!

## భారత్– చైనా సంబంధాలకు 75 ఏళ్లు..

## జిన్‌పింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు

**భారత్- చైనా దౌత్య సంబంధాలు ఏర్పడి 75 ఏళ్ల సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.**

**ఈ-కబురు, బీజింగ్:**
భారత్ చైనా దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాలు మరింత సన్నిహితంగా కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో పరస్పర అభినందన

తరువాయి 3లో



## బాణసంచా గోదాంలో పేలుడు..

# 21కి చేరిన మృతులు

**బాణసంచా కర్మాగారంలో సంభవించిన పేలుడు ఘటనలో పలువురు మృతిచెందిన ఘటన గుజరాత్‌లో చోటుచేసుకుంది.**



2లో

# హెచ్‌సీయూ భూమి.. ఒక్క అడుగు కూడా ప్రభుత్వం తీసుకోదు: మంత్రి శ్రీధర్‌బాబు

**హెచ్‌సీయూ భూమి.. ఒక్క అడుగు కూడా ప్రభుత్వం తీసుకోదు: మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన ఆస్తి, ఒక అంగుళం భూమిని కూడా రాష్ట్ర ప్రభుత్వం తీసుకోలేదని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.**



**హైదరాబాద్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన ఆస్తి, ఒక అంగుళం భూమిని కూడా రాష్ట్ర ప్రభుత్వం తీసుకోలేదని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ విషయంలో కొంతమంది వ్యక్తులు, కొన్ని పార్టీలతో అనుసంధానంగా ఉన్న సంఘాలు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వర్సిటీ భూమి వర్సిటీకే ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పనికి అడ్డుతగిలితే ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. సచివాలయంలో నిర్వహించిన మంత్రుల మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు.

''వారం రోజుల క్రితం హెచ్‌సీయూ వీసీ, రిజిస్ట్రార్‌తో ప్రభుత్వ పరంగా మేం సంప్రదింపులు చేశాం. వారికి స్పష్టంగా చెప్పాం. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించాలని భావించాం. వర్సిటీ భూమి వర్సిటీకే ఉండాలని వారికి తెలియజేశాం. 2016లో సీనియర్ ఐఏఎస్ అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తే.. 1500 పైచిలుకు ఎకరాల భూమి వారికి న్యాయపరంగా ఇచ్చేందుకు సిఫార్సులు చేశారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని మీరు మీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో చర్చించాలని సూచించాం. చట్టపరమైన అన్ని హక్కులు కల్పిస్తామని వారికి స్పష్టంగా చెప్పాం''

''గత రెండు రోజుల నుంచి కొన్ని మీడియా సంస్థలు, కొన్ని పార్టీలకు సంబంధించిన సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారు. ఈరోజు అక్కడ ఉన్న రాక్ ఫార్మేషన్స్, లేక్‌లు, ప్రసిద్ధి గాంచిన మష్రూమ్ రాక్స్, పికాక్ లేక్‌ను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. హెచ్‌సీయూ పరిసరాల్లో జీవ వైవిధ్యాన్ని కాపాడతాం. అవన్నీ ప్రభుత్వ భూముల్లో ఉన్నప్పటికీ వాటిని పరిరక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. 400 ఎకరాల ప్రభుత్వ భూమిని న్యాయపరంగానే తీసుకుంటున్నాం. హెచ్‌సీయూ విద్యార్థులు ఆందోళనకు గురికావొద్దు. పార్టీల ప్రలోభానికి లోనుకావొద్దు'' అని శ్రీధర్‌బాబు తెలిపారు.

# ...సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన

**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లనున్నట్టుగా తెలుస్తోంది. రాష్ట్ర మంత్రులు, బీసీ వర్గాలకు చెందిన కాంగ్రెస్ శాసనసభ్యులు, ఎంపీల అఖిలపక్ష బృందంతో కలిసి బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఏప్రిల్ 2, 3 తేదీల్లో జాతీయ స్థాయి మద్దతును సేకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన లక్ష్యంగా తెలుస్తోంది.**

**ఈ-కబురు:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లనున్నట్టుగా తెలుస్తోంది. విద్య, ఉపాధి, స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల (బీసీ)కు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు బిల్లులకు ఇటీవల తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. వీటిని పార్లమెంట్లో ఆమోదించి, తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీసీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం (ఏప్రిల్ 2) రోజున ఢిల్లీలో మహాధర్నా చేపట్టేందుకు సిద్ధమయ్యాయి. ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర 12 బీసీ సంఘాలు బీసీల పోరు గర్జన పేరుతో ఈ మహాధర్నాను నిర్వహించనున్నారు. ఈ మహాధర్నాకు రావాలని కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్, వామపక్షాలు, టీజేఎస్‌తోపాటు బీజేపీ నేతలను బీసీ సంఘాల ప్రతినిధులు ఆహ్వానించారు. దీంతో పలు పార్టీలలో బీసీ నాయకులు ఈ ధర్నాలో పాల్గొనేందుకు ఢిల్లీ బాట పట్టారు.

అయితే ఇందుకు మద్దతుగా తెలంగాణ ముఖ్యమంత్రి కూడా మంగళవారం సాయంత్రం ఢిల్లీ బయలుదేరి వెళ్లే అవకాశాలు ఉన్నట్టుగా తెలుస్తోంది. రాష్ట్ర మంత్రులు, బీసీ వర్గాలకు చెందిన కాంగ్రెస్ శాసనసభ్యులు, ఎంపీల అఖిలపక్ష బృందంతో కలిసి బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఏప్రిల్ 2, 3 తేదీల్లో జాతీయ స్థాయి మద్దతును సేకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన లక్ష్యంగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డి ఏప్రిల్ 2న బీసీ సంఘాలు నిర్వహించనున్న మహా ధర్నాలో పాల్గొననున్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలను, వివిధ పార్టీల నాయకులను కలిసి బీసీ బిల్లులను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చే అంశంపై మద్దతు ఇవ్వాలని కోరే అవకాశం ఉంది. పార్లమెంట్‌లో ఈ బిల్లును ఆమోదించడంతో పాటు తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేయనున్నారు.

ఇక, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్లా ఐలయ్య, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, వాకిటి శ్రీహరి, ఈర్లపల్లి శంకరయ్యలు కూడా ఢిల్లీ వెళ్లనున్నారు. కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, వామపక్షాలు, టీజేఎస్, ఇతర రాష్ట్రాల్లోని పలు పార్టీల నేతలు కూడా బీసీల పోరు గర్జన మహాధర్నాలో పాల్గొననున్నారు.

# ...రాష్ట్ర ప్రజల విజయం: భట్టి విక్రమార్క

**హైదరాబాద్:** అబద్ధాల మీదే బతుకుతున్న కొన్ని రాజకీయ పార్టీలు కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో అడ్డగోలుగా వ్యవహరిస్తూ దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను వెనక్కి తెచ్చుకోవాలని.. పదేళ్లు పాలించిన భారాస ఎలాంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. ఈ మేరకు సచివాలయంలో మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు.



''హెచ్‌సీయూ నుంచి భూములను లాక్కొని రాష్ట్ర ప్రభుత్వం అక్కడ ఏవో వెంచర్లు, ప్లాట్లు వేసి అమ్ముకునేందుకు ప్రయత్నిస్తోందని ప్రచారం చేస్తున్నారు. 1312024 వరకు ఈ 400 ఎకరాలు హెచ్‌సీయూ పరిధిలోనే ఉందని వర్సిటీ భావిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వం ఉన్న సమయంలో ఈ 400 ఎకరాలను వర్సిటీ నుంచి తీసుకొని ఓ ప్రైవేటు సంస్థకు కేటాయించారు. ఆ 400 ఎకరాలకు బదలాయింపుగా వర్సిటీకి ఆనుకొని మరోవైపు ఉన్న 397 ఎకరాలు వర్సిటీకి కేటాయించారు. దానికి సంబంధించి ఆనాడు రెవెన్యూ అధికారులు, వర్సిటీ యాజమాన్యం కలిసి సంతకం చేసిన రికార్డులు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. రాష్ట్ర ప్రజలు, వర్సిటీ విద్యార్థులకు ఈ విషయాలు తెలియాల్సిన అవసరం ఉంది. ఈ రికార్డులకు సంబంధించిన పత్రాలను మీడియాకు అందిస్తాం. ఈ అంశంలో కొన్ని రాజకీయ పార్టీలు కావాలనే దుష్ప్రచారం చేస్తూ ప్రజలు, విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నాయి''

''బదలాయింపులో భూమి దక్కించుకున్న వర్సిటీ బాగుంది. మరి ఓ ఫ్రాడ్ సంస్థకు కేటాయించిన ఆ 400 ఎకరాలు పరిస్థితి ఏంటి? అదంతా ప్రజల ఆస్తి. ప్రజలకే దక్కాలని ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 21112006లో వైఎస్ఆర్ నాయకత్వంలో ప్రైవేటు సంస్థకు ఇచ్చిన భూముల కేటాయింపును రద్దు చేసింది. మాకు ఇప్పటికే గత ప్రభుత్వం రాసి ఇచ్చింది.. ఇప్పుడు మీరు రద్దు చేస్తే ఎలా అని ఆ సంస్థ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. ఇది ప్రజల ఆస్తి.. ప్రజలకే ఉండాలనే నిర్ణయంతో ఆనాటి నుంచి పోరాడుతూ వస్తున్నాం. ఆ తర్వాత రాష్ట్ర విభజన జరిగింది. పదేళ్ల భారాస పాలనలో ఏనాడూ ఆ భూములను వెనక్కి తెచ్చుకోవాలని ప్రయత్నాలు చేయలేదు. తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.వేల కోట్ల విలువైన భూమి ప్రభుత్వానికే చెందేలా పోరాటం చేయాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నాం. హైకోర్టులో కొట్లాడి కేసు గెలిచాం. తెలంగాణ ప్రజల ఆస్తిని తిరిగి తెచ్చుకున్నాం. ఆ తర్వాతే టీజీఐఐసీ అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. ఇది అభినందించాల్సిన విషయం''

''ఈ 400 ఎకరాలను కాపాడి.. అక్కడ కూడా ఉద్యోగ అవకాశాలు లభించేలా ఒక కార్యాచరణ రూపొందించి ముందుకెళ్తున్నాం. హైటెక్ సిటీ, హైటెక్ సిటీ ఫేజ్ 2, నాలెడ్జ్ సిటీ వంటి వాటి ద్వారానే ఉపాధి పెరిగింది. అదే విధంగా యువతకు భారీ ఉపాధి అవకాశాలు కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం. అప్పట్లో ఈ భూములను గాలికొదిలేశారు.. ఇప్పుడు దుష్ప్రచారం చేస్తున్నారు. హైదరాబాద్ అభివృద్ధి జరగాలి. సంపద సృష్టించాలి. ఉపాధి పెరగాలి. మేం పట్టించుకోకపోతే ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లేది. 400 ఎకరాలు సాధించడం ఈ ప్రభుత్వ విజయం.. రాష్ట్ర ప్రజల విజయం'' అని భట్టి పేర్కొన్నారు.

**విద్యార్థుల ముసుగులో భారాస వ్యక్తుల అరాచకం: మంత్రి పొంగులేటి**
హెచ్‌సీయూ భూఅంశంపై రాద్ధాంతం చేస్తోన్న వారికి హైరైజ్ బిల్డింగులకు అనుమతి ఇచ్చేటప్పుడు పర్యావరణం గుర్తుకురాలేదా? అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ భూముల్లోని జంతువులు, పక్షులకు ఎలాంటి హాని జరగలేదని చెప్పారు. జంతువులు చనిపోయినట్లు సోషల్‌మీడియాలో చూపుతున్న చిత్రాలు పాతవని స్పష్టం చేశారు. ''మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబు హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులే. అక్కడి బండరాళ్లు, చెరువులకు ఎలాంటి నష్టం జరగనివ్వబోం. విద్యార్థుల ముసుగులో భారాస వ్యక్తులు అరాచకం చేస్తున్నారు'' అని మంత్రి మండిపడ్డారు.



## విద్యార్థుల ఆందోళన.. హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత

**కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత నెలకొంది.**

**హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆ భూములను పరిరక్షించాలంటూ పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళనకు దిగారు. హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్దకు చేరుకుని నిరసన తెలుపుతున్నారు. మరోవైపు యూనివర్సిటీ లోపలికి వెళ్లేందుకు బీజేవైఎం, ఏబీవీపీ, వామపక్షాల నేతలు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని పీఎస్‌లకు తరలించారు.



# ఆ 400 ఎకరాలు ముమ్మాటికీ సర్కారువే

**రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబరు 25లో 400 ఎకరాలపై యాజమాన్య హక్కులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానివేనని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.**

**హెచ్‌సీయూ సహకారంతోనే సరిహద్దుల గుర్తింపు**
**టీజీఐఐసీకి జూన్‌లో అప్పగించాం**
**విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్న కొందరు రాజకీయ నాయకులు**
**రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబరు 25లో 400 ఎకరాలపై యాజమాన్య హక్కులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానివేనని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. దీనిపై హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో వేసిన వ్యాజ్యాలపై పోరాడి కాంగ్రెస్ ప్రభుత్వం హక్కులు దక్కించుకుందని పేర్కొన్నారు. ఈ భూమిలో ఒక్క అంగుళం కూడా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందినది లేదని పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించి సృష్టించే ఎటువంటి వివాదమైనా కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందన్నారు. ప్రభుత్వం ఇక్కడ చేపట్టే ప్రాజెక్టును వ్యతిరేకించే వారంతా రాజకీయ నాయకులేనని, కొందరు స్థిరాస్తి వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌సీయూ భూ వివాదంపై ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

**'' 2003 జనవరి 13న నాటి ప్రభుత్వం ఐఎంజీ అకడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్‌కు మెమో నం.39612/ఏఎస్ఎస్ఎన్/వి(2) 2003 ప్రకారం కంచ గచ్చిబౌలి గ్రామంలోని భూమిని కేటాయించింది. ఆ సంస్థ తన ప్రాజెక్టును ప్రారంభించకపోవడంతో 2006 నవంబరు 21న కేటాయింపును రద్దు(నం.111080/ఎస్1/2003) చేసి ఏపీ యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చరల్ డిపార్ట్‌మెంటుకు కేటాయించింది.**

ఈ భూమి కేటాయింపులపై ఐఎంజీ అకడమీస్ హైకోర్టులో 2006లో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఉమ్మడి ఏపీలో రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వాలు ఈ భూమి ప్రభుత్వానిదని వాదనలు వినిపించాయి. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వాదనలు వినిపించింది. దీంతో 2024 మార్చి 7న హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీనిని ఐఎంజీ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా పటిష్ఠమైన వాదనలు వినిపించడంతో 2024 మే 3న సదరు పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో 400 ఎకరాల భూమిపై యాజమాన్య హక్కులు ప్రభుత్వానికి దక్కాయి.

2024 జూన్ 19న ఐటీ, ఇతర ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆ భూమిని కేటాయించాలని టీజీఐఐసీ ప్రతిపాదనలు సమర్పించింది. దీంతో రెవెన్యూశాఖ జూన్ 24న ఆ భూమి హక్కులను టీజీఐఐసీకి బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు భూమికి పంచనామా నిర్వహించి జులై 1న అప్పగించారు. ఆ భూమి అటవీ పరిధిలో లేదని రెవెన్యూ రికార్డుల్లో స్పష్టమవుతోంది.

జులై 19న వర్సిటీ రిజిస్ట్రార్, ఇంజినీర్, ఈఈతో కలిసి రెవెన్యూ అధికారుల సమక్షంలో భూ సర్వే చేసి హద్దులు నిర్ధారించారు. టీజీఐఐసీ అభివృద్ధి చేస్తున్న 400 ఎకరాల్లో బఫెల్లో లేక్, పికాక్ లేక్‌లు లేవు. టీజీఐఐసీ రూపొందించే లేఅవుట్‌లో మష్‌రూమ్ రాక్స్‌తోపాటు ఇతర రాళ్ల అమరికను హరిత స్థలాలుగా పరిరక్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది'' అని పొంగులేటి పేర్కొన్నారు.

**400 ఎకరాల భూ బదలాయింపుపై డాక్యుమెంట్ల విడుదల**
భూ వివాదం నెలకొన్న నేపథ్యంలో కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలకు సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లను ముఖ్యమంత్రి కార్యాలయం సోమవారం మీడియాకు విడుదల చేసింది. వాటిలో ఉన్న సమాచారం ప్రకారం.. కంచ గచ్చిబౌలిలోని హెచ్‌సీయూకి చెందిన సర్వే నెంబరు 25లోని 534.28 ఎకరాల భూమిని అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వానికి స్వాధీనపర్చింది. దీనికి ప్రతిగా గోపనపల్లిలో సర్వే నంబరు 36, 37లో 397.16 ఎకరాలను ప్రభుత్వం వర్సిటీకి బదలాయించింది. దీనికి సంబంధించి అప్పటి రిజిస్ట్రార్ వై.నరసింహులు సంతకం చేసిన కాపీలను సీఎంవో విడుదల చేసింది

# కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. మంత్రులతో చర్చించిన సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజి తరువాయి

సమీక్షించారు. ఈ అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, పొంగులేటి సాయంత్రం మీడియాతో మాట్లాడే అవకాశం ఉంది.

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబరు 25లో 400 ఎకరాలపై యాజమాన్య హక్కులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానివేనని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. దీనిపై హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో వేసిన వ్యాజ్యాలపై పోరాడి కాంగ్రెస్ ప్రభుత్వం హక్కులు దక్కించుకుందని పేర్కొన్నారు. ఈ భూమిలో ఒక్క అంగుళం కూడా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందినది లేదని పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించి సృష్టించే ఎటువంటి వివాదమైనా కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందన్నారు.

కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో హెచ్‌సీయూ వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. ఆ భూములను పరిరక్షించాలంటూ పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళనకు దిగారు. హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. హెచ్‌సీయూని సందర్శించేందుకు బయల్దేరిన భాజపా నేతలను సైతం పోలీసులు అడ్డుకున్నారు. హెచ్‌సీయూ సందర్శనకు అనుమతి లేదంటూ పోలీసులు వారిని అరెస్టు చేశారు.

**హైకోర్టులో వట ఫౌండేషన్ పిల్..**
కంచ గచ్చిబౌలి భూములపై హైకోర్టులో పిల్ దాఖలైంది. జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలంటూ వట ఫౌండేషన్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. అత్యవసర విచారణకు స్వీకరించాలని ఫౌండేషన్ తరఫు న్యాయవాది కోరారు. దీనిపై బుధవారం విచారణ చేపడతామని హైకోర్టు తెలిపింది.

# మూడు నెలలు మండుటెండలే

**ప్రస్తుత వేసవిలో ఏప్రిల్-జూన్ మధ్య ఎండలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేస్తోంది. మధ్య, తూర్పు ప్రాంతాల్లో, వాయవ్య రాష్ట్రాల్లో ఎక్కువరోజులు వడగాలులు వీస్తాయని హెచ్చరిస్తోంది. కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువరోజులు వడగాలులు వాటిలో తెలంగాణ కూడా: ఐఎండీ**

**దిల్లీ:** ప్రస్తుత వేసవిలో ఏప్రిల్‌జూన్ మధ్య ఎండలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేస్తోంది. మధ్య, తూర్పు ప్రాంతాల్లో, వాయవ్య రాష్ట్రాల్లో ఎక్కువరోజులు వడగాలులు వీస్తాయని హెచ్చరిస్తోంది. ఎక్కువ ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి మించి నమోదవుతాయని, కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా పలుచోట్ల సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని ఐఎండీ అధిపతి మృత్యుంజయ్ మహాపాత్ర సోమవారం ఆన్‌లైన్‌లో విలేకరుల సమావేశంలో తెలిపారు. ''రాబోయే మూడు నెలలపాటు అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే రెండు నుంచి నాలుగు రోజులు ఎక్కువగా వడగాలులు వీస్తాయి. మామూలుగానైతే ఈ మూడు నెలల్లో నాలుగు నుంచి ఏడురోజుల వరకు వడగాలులు నమోదవుతుంటాయి. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, రాజస్థాన్, యూపీ, హరియాణా, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువగా వడగాలుల రోజులు కొనసాగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఏప్రిల్‌లో దేశంలో చాలా ప్రాంతాల్లో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి'' అని వివరించారు.

**రాష్ట్రానికి వడగళ్ల వాన హెచ్చరికలు**
**ఈ-కబురు, హైదరాబాద్:** రాష్ట్రంలో రానున్న 3 రోజుల్లో కొన్ని జిల్లాల్లో వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. మంగళ, బుధ, గురువారాల్లో చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మొదలై ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 50 కిలోమీటర్లలోపు ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. కాగా, సోమవారం ఆదిలాబాద్‌లో సాధారణం కన్నా 2.4 డిగ్రీలు పెరిగి 41.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది.

# ఏప్రిల్ 27న 10 లక్షల మందితో రజతోత్సవ మహాసభ: కేసీఆర్

మొదటి పేజి తరువాయి

చిన్నపాటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు అధినేత. అందుకోసం.. 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు, 10 లక్షల నీళ్ల బాటిళ్లు అందుబాటులో ఉంచాలని నాయకులతో కేసీఆర్ చెప్పారు. ఈ సమావేశంలో కేటీఆర్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలు మధుసుదనా చారి, పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



**154 ఎకరాల్లో సభా ప్రాంగణం**
తెలంగాణలోని అన్ని ప్రాంతాలను కలిపే జాతీయ రహదారి 563, 763కు జంక్షన్‌గా ఉండే.. ఎల్కతుర్తిని సభా కేంద్రంగా ఎంచుకున్నారు బీఆర్ఎస్ అధినేత. కేసీఆర్, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు అక్కడ 1,213 ఎకరాలను చదును చేశారు. ఇందులో 154 ఎకరాల్లో రజతోత్సవ మహాసభ ప్రాంగణం ఉండనుంది. అంతేకాదు పార్కింగ్ కోసం ఏకంగా 1,059 ఎకరాలు కేటాయించనున్నారు. 50 వేల వాహనాలను నిలిపేందుకు వీలుగా పార్కింగ్ ఏర్పాట్లు చేయనున్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రంలోని సెంటిమెంట్‌గా ఉంటున్న వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభను లక్షలాది మందితో వరంగల్‌లో ఏప్రిల్ 27న నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ ఈనెల 7న నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఎలుకతుర్తిలో సభా స్థలాన్ని పలువురు నాయకులు పరిశీలించారు. ఈ సభా వేదిక కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను కేసీఆర్ ఎండగట్టనున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలిరానున్న బీఆర్ఎస్ శ్రేణుల్లో కొండంత ఆత్మవిశ్వాసం నింపనున్నారు గులాబీ బాస్.

# రాజకీయాలు నాకు ఫుల్‌టైమ్ జాబ్ కాదు: యోగి ఆదిత్యనాథ్

**తన రాజకీయ జీవితంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.**



**ఈ-కబురు:**
ప్రధాని నరేంద్ర మోదీ వారసత్వం గురించి మహారాష్ట్ర అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన రాజకీయ జీవితంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ''నేను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని. పార్టీ నన్ను యూపీ ప్రజల కోసం నియమించింది. అందుకే రాష్ట్రాభివృద్ధి కోసం పని చేస్తున్నాను. ఇక పాలిటిక్స్ నాకు ఫుల్‌టైమ్ జాబ్ కాదు. వాస్తవానికి నేను ఒక యోగిని' అని ఆయన పేర్కొన్నారు.

**మోదీ వారసత్వంపై చర్చ అనవసరం**
ప్రతి పనికి ఒక కాలపరిమితి ఉంటుందని.. అదే విధంగా తన రాజకీయ జీవితానికి కూడా పరిమితి ఉంటుందని అన్నారు. జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భాజపా హైకమాండ్‌తో తనకు విభేదాలు ఉన్నాయని వస్తున్న వార్తలను యోగి ఖండించారు. తనకు పార్టీ ఇచ్చిన అవకాశం వల్లే ఇక్కడ కూర్చున్నానని.. పార్టీ పెద్దలతో విభేదాలు ఉంటే ముఖ్యమంత్రి స్థానంలో కొనసాగేవాడిని కాదని అన్నారు. ఎవరో ఒకరు తప్పుడు ప్రచారాలు చేస్తూనే ఉంటారని.. వాటిని తాను పట్టించుకోనని స్పష్టం చేశారు.

ఆదివారం నాగ్‌పుర్‌లోని సంఘ్ ప్రధాన కార్యాలయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించడంపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత పదేళ్లలో ఎన్నడూ ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి వెళ్లని ప్రధాని ఇప్పుడు వెళ్లడం వెనక ముఖ్యమైన కారణం ఉండొచ్చని అన్నారు. ఆయన పదవీవిరమణ చేయాలని యోచిస్తున్నారని.. తన రిటైర్మెంట్ ప్రణాళికల గురించి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో చర్చలు జరపడానికే అక్కడికి వెళ్లి ఉంటారని అభిప్రాయం వ్యక్తంచేశారు. దేశ రాజకీయ నాయకత్వంలో ఆరెస్సెస్ మార్పు కోరుకొంటోందని, మోదీ వారసుడు మహారాష్ట్ర నుంచే వస్తాడని అన్నారు. ఆయన వ్యాఖ్యలను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కొట్టిపడేశారు. ఈ నేపథ్యంలో యోగి ఆదిత్యనాథ్ మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. పార్లమెంట్‌లో లేవనెత్తిన తెలంగాణ భాజపా ఎంపీలు

**నగరంలోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారాన్ని తెలంగాణ భాజపా ఎంపీలు పార్లమెంట్ ఉభయసభల్లో ప్రస్తావించారు.**

**ఈ-కబురు,దిల్లీ:**
హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారాన్ని తెలంగాణ భాజపా ఎంపీలు పార్లమెంట్ ఉభయసభల్లో ప్రస్తావించారు. ఎంపీ లక్ష్మణ్ రాజ్యసభ జీరో అవర్‌లో ఈ విషయాన్ని లేవనెత్తారు. 400 ఎకరాల హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం టీజీఐఐసీ ద్వారా భూముల అమ్మకానికి సిద్ధమైందని, విశ్వవిద్యాలయానికి కూటాయించిన భూములను కాపాడాలని కోరారు. యూనివర్సిటీకి కేటాయించిన భూములను మార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీలు కోరారు. ఇదే అంశంపై లోక్‌సభ జీరో అవర్‌లోనూ తెలంగాణ ఎంపీలు లేవనెత్తారు. అనంతరం కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను కలిశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, నగేశ్ తదితరులు ఉన్నారు.



## ఆ భూముల అమ్మకాలతో రూ. కోట్లు దండుకోవాలనుకోవడం దుర్మార్గం: బండి సంజయ్

**అటవీ లక్షణాలు కలిగిన ఏ భూమినైనా కేంద్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా నరికివేయొద్దంటూ సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు.**

**ఈ-కబురు, హైదరాబాద్:**
అటవీ లక్షణాలు కలిగిన ఏ భూమినైనా కేంద్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా నరికివేయొద్దంటూ సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కంచ గచ్చిబౌలిలో తెలంగాణ ప్రభుత్వం వేలం వేయాలనుకున్న 400 ఎకరాల భూమి అటవీ పరిధిలోనిదని చెప్పారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు.

''కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమికి సంబంధించిన వివాదంపై హైకోర్టులో కేసు నడుస్తోంది. ఓ ఎన్జీవో దాఖలు చేసిన పిటిషన్‌పై ఏప్రిల్ 7 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ఉన్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ భూములు వేలం వేయడం కుదరదు. ఈ విషయం తెలిసినా ప్రభుత్వం భూముల చదును పేరుతో కోర్టు ధిక్కరణకు పాల్పడుతోంది. మొక్కలు, చెట్లను తొలగిస్తూ పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతోంది. ఆ భూములను డీఫారెస్టేషన్ చేసి అమ్మకాల ద్వారా రూ.కోట్లు దండుకోవాలనుకోవడం దుర్మార్గం.

భారాస ప్రభుత్వాన్ని మించి కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. ప్రజా ప్రయోజనాలకు కాకుండా ప్రభుత్వ భూములను అడ్డగోలుగా విక్రయించడాన్ని రేవంత్ రెడ్డి గతంలో వ్యతిరేకించిన సంగతి మర్చిపోయారా? కంచ గచ్చిబౌలి భూముల విక్రయం కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలకు పరాకాష్ఠ. తక్షణమే ఆ భూముల అమ్మకంపై ప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు'' అని బండి సంజయ్ అన్నారు.

## ..విపక్ష పార్టీలు కీలక నిర్ణయం

మొదటి పేజి తరువాయి

పాల్గొంటాయని.. కానీ, వ్యతిరేకంగా ఓటు వేయనున్నట్లు శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంకా చతుర్వేది చెప్పినట్లు సమాచారం.

వక్ఫ్ (సవరణ) బిల్లుపై మోదీ సర్కార్ రాజ్యాంగ విరుద్ధమైన, విభజన అజెండాను ఓడించేందుకు అన్ని ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా ఉన్నాయని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. పార్లమెంటులో విపక్షాలన్నీ కలిసి పనిచేస్తాయని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

మరోవైపు, కాంగ్రెస్ పార్టీ తన ఎంపీలకు విప్ జారీ చేసింది. వచ్చే మూడు రోజులూ సభ్యులంతా సభకు హాజరుకావాలని సూచించింది. ఇదిలా ఉండగా.. వక్ఫ్ (సవరణ) బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న వేళ దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. అసాంఘిక శక్తుల వల్ల శాంతిభద్రతలకు ముప్పువాటిల్లకుండా పలు సున్నితమైన ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆయా ప్రాంతాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు రాత్రి గస్తీని ముమ్మరం చేశామన్నారు. అదనపు బలగాలను మోహరించారు

## భారత్– చైనా సంబంధాలకు 75 ఏళ్లు.. జిన్‌పింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి

సందేశాలను ఇచ్చిపుచ్చుకున్నారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు ఏనుగు డ్రాగన్‌లా అభివృద్ధి చెందాలని అన్నారు. 2020లో తూర్పు లద్దాఖ్‌లో సైనికుల మధ్య తీవ్ర ఘర్షణతో ఇరు దేశాల మధ్య స్తంభించిన సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నాలు కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం విశేషం.

పొరుగు దేశాలు శాంతియుతంగా ఉండేందుకు మార్గాలను అన్వేషించాలన్న జిన్‌పింగ్.. కీలకమైన అంతర్జాతీయ వ్యవహారాల్లో సంప్రదింపులు, సమన్వయాన్ని మరింతగా పెంచుకొనేందుకు, సరిహద్దు ప్రాంతాల్లో శాంతిని సంయుక్తంగా కాపాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

మరోవైపు.. భారత్ చైనా మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి నేటికి 75 ఏళ్లు అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ అన్నారు. చైనా అధ్యక్షుడు, ప్రధాని.. భారత రాష్ట్రపతి, ప్రధానిలతో అభినందన సందేశాలు ఇచ్చిపుచ్చుకున్నట్లు మీడియా సమావేశంలో వెల్లడించారు. రెండు దేశాలూ పురాతన నాగరికతలు కలిగి ఉన్నాయని, ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు అన్నారు. గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన సభ్యులైన ఇరు దేశాలూ ఆధునికీకరణలో కీలక దశలో ఉన్నాయని పేర్కొన్నారు.



## బాణసంచా గోదాంలో పేలుడు.. 21కి చేరిన మృతులు

**బాణసంచా కర్మాగారంలో సంభవించిన పేలుడు ఘటనలో పలువురు మృతిచెందిన ఘటన గుజరాత్‌లో చోటుచేసుకుంది.**

**ఈ-కబురు,బనస్కంతా:**
గుజరాత్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బనస్కంతా జిల్లాలోని ఓ బాణసంచా గోదాంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 21కి పెరగ్గా.. ఆరుగురికి గాయాలైనట్లు పోలీసులు వెల్లడించారు. ఈ పేలుడు ధాటికి కూలిన భవన శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు తెలుస్తోంది.

బనస్కంతా జిల్లా కేంద్రానికి 30కి.మీల దూరంలోని దీసా పారిశ్రామిక ప్రాంతంలోని గోదాములో మంగళవారం ఉదయం 9.45గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. మృతులు మధ్యప్రదేశ్‌లోని హర్దా, దేవాస్ జిల్లాలకు చెందినవారిగా గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ మిహిర్ పటేల్ తెలిపారు. 19 మంది మృతదేహాలను గుర్తించామని.. మిగతా ఇద్దరి వివరాలను గుర్తించేందుకు డీఎన్‌ఏ నమూనాలను సేకరించినట్లు తెలిపారు. పేలుడు తీవ్రతకు కార్మికుల శరీర భాగాలు 200 300 మీటర్ల దూరం వరకు ఎగిరిపడ్డాయి. ఆ భవనం శ్లాబ్ కూలిపోయింది. దీంతో అదే ఆవరణలో నివసిస్తున్న కార్మికుల కుటుంబ సభ్యులు సైతం ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై గుజరాత్ మంత్రి రిషికేశ్ పటేల్ మీడియాతో మాట్లాడారు. ఏడు అగ్నిమాపక బృందాలు, ఎనిమిది అంబులెన్సులు, ఎస్‌డీఆర్ఎఫ్ బృందం, నాలుగు బుల్డోజర్లతో సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పేలుడు తర్వాత గోడౌన్ స్లాబ్ కూలిపోవడంతో ప్రాణనష్టం సంభవించిందని ఎస్పీ అక్షయ్‌రాజ్ మక్వానా తెలిపారు. పేలుడుకు గల కారణాన్ని తెలుసుకొనేందుకు ఫోరెన్సిక్ బృందాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. ఈ గోదాంలో అక్రమంగా బాణసంచా నిల్వ చేస్తున్నారని తేలింది. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేశారు. డిప్యూటీ ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీసా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ నేహా పంచల్ మాట్లాడుతూ.. గోదాంలో మొదట్లో బాణసంచా నిల్వ చేసేందుకు లైసెన్స్ ఉందని.. కానీ డిసెంబర్ 31, 2024న గడువు ముగిసిన తర్వాత లోపాల కారణంగా దాన్ని పునరుద్ధరించలేదన్నారు. లైసెన్స్ గడువు ముగిసిన తర్వాత వారు పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. యూనిట్‌లో సరైన సౌకర్యాలు లేవని అధికారులు గుర్తించి.. లైసెన్స్ పునరుద్ధరణ ప్రక్రియ నిలిపివేసినట్లు తెలిపారు.

**ప్రధాని మోదీ దిగ్భ్రాంతి**
ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని సహాయ నిధి నుంచి రూ.2లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.4లక్షల చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు. క్షతగాత్రులకు చెరో రూ.50వేలు చొప్పున ప్రకటించారు. మరోవైపు, మధ్యప్రదేశ్ సీఎం ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తమ రాష్ట్రం నుంచి కార్మికులు అక్కడ మృతిచెందడంతో వారికి రూ.2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున సాయం ప్రకటించారు.

## బ్యాంకాక్‌లో భూవిలయం.. ఆ భవన శిథిలాల కింద 300 మంది కార్మికులు!



**భారీ భూకంపం కారణంగా బ్యాంకాక్‌లోని ఓ ఆకాశహర్మ్యం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ భవనం శిథిలాల కింద 300 మంది కార్మికులు చిక్కుకుని ఉంటారని కథనాలు వెలువడుతున్నాయి.**

**ఈ-కబురు,బ్యాంకాక్:**
ఇటీవల మయన్మార్‌తో పాటు థాయ్‌లాండ్‌లో 12 నిమిషాల వ్యవధిలోనే రెండు సార్లు భారీ భూకంపాలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ భూ ప్రకంపనల ధాటికి అనేక భవంతులు ఊగిపోగా.. పలు భవనాలు నేలమట్టమయ్యాయి. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవంతి పేకమేడలా కుప్పకూలింది. ఈ ఘటనలో పలువురు మృతిచెందగా.. 74 మంది శిథిలాల కింద చిక్కుకున్నారని ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే ఆ సంఖ్య 300 నుంచి 400 వరకు ఉండే అవకాశముందని తాజాగా కథనాలు వెలువడుతున్నాయి. ఇప్పటి వరకూ ఇక్కడ 13 మృతదేహాల వెలికితీసినట్లు అధికారులు పేర్కొన్నారు.

శిథిలాల కింద చిక్కుకుపోయిన నిర్మాణ కార్మికుల్లో దాదాపు 60మంది మయన్మార్ వాసులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. మిగతా వారంతా కూలి పనుల కోసం విదేశాల నుంచి తీసుకొచ్చిన కార్మికులేనని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సజీవంగా ఉన్న వారిని, మృతదేహాలను గుర్తించడానికి అధునాతన పరికరాలతో పాటు జాగిలాలను ఉపయోగిస్తున్నారు.
2020లో ఈ భవన నిర్మాణం ప్రారంభించినట్లు అధికారులు పేర్కొన్నారు. దీని నిర్మాణంలో చైనాకు చెందిన ఓ సంస్థకు భాగస్వామ్యం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ భవంతి కూలిన తర్వాత నలుగురు చైనీయులు శిథిలాలు ఉన్న ప్రాంతం వద్దకు అక్రమంగా వెళ్లి కొన్ని పత్రాలను తీసుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. ఇదే ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇతర ఎత్తయిన భవనాలు సురక్షితంగానే ఉన్నా, ఇది మాత్రమే కూలిపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. శిథిలాల నుంచి సేకరించిన నిర్మాణ సామగ్రిని పరిశీలించగా.. అందులో నాసిరకం ఉక్కు, ఇతర, నిర్మాణ సామగ్రి వాడినట్లు గుర్తించామన్నారు. మరిన్ని వివరాలు తెలుసుకోవడం కోసం వాటిని పరీక్షలకు పంపామని.. వారం రోజుల్లో నివేదిక వస్తుందని వెల్లడించారు.

శుక్రవారం 7.7 తీవ్రతతో ప్రకంపనలు సంభవించడంతో ఈ భవనం కూలిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అటు మయన్మార్‌లో ఈ భూకంపం కారణంగా భారీగా ప్రాణ నష్టం సంభవించింది. ఈ భూవిలయంలో మృతుల సంఖ్య 2,056కి పెరగగా.. 3900 మందికి పైగా గాయపడినట్లు మయన్మార్ సైనిక ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటికీ ఇంకా 270 మంది ఆచూకీ లభ్యం కాలేదని తెలిపింది. అటు బ్యాంకాక్‌లో మృతుల సంఖ్య 19కి పెరిగింది.

## చిలీని అంటార్కిటికాకు గేట్‌వేగా చూస్తున్నాం: ప్రధాని మోదీ

**భారత పర్యటనకు విచ్చేసిన చిలీ అధ్యక్షుడితో ప్రధాని మోదీ చర్చలు జరిపారు.**



**ఈ-కబురు:** చిలీని అంటార్కిటికాకు గేట్‌వేగా చూస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత పర్యటనకు విచ్చేసిన చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్‌తో ప్రధాని భేటీ అయ్యారు. ఆర్థిక, వాణిజ్య, సామాజిక రంగాలతో సహా వివిధ ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం మోదీ మాట్లాడుతూ..లాటిన్ అమెరికాలో చిలీ భారత్‌కు ఓ ముఖ్యమైన భాగస్వామి అని పేర్కొన్నారు. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభించామని..వాటిని కొనసాగించాలన్నారు. ఆయుర్వేదం, సంప్రదాయ మెడిసిన్, వ్యవసాయ ఉత్పత్తుల సహకారంపై ఒప్పందాలు ఇరు దేశాలకు ప్రయోజనకరంగా ఉంటాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. భారత్, చిలీల మధ్య ఎన్నో సాంస్కృతిక సారూప్యతలు ఉన్నాయని పేర్కొన్నారు. సమకాలీన సవాళ్లను సమర్థవంతంగా పరిష్కరించడానికి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి , ఇతర ప్రపంచ సంస్థలలో సంస్కరణలు అవసరమని భావిస్తున్నామని.. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి పిలుపునిచ్చామని తెలిపారు.

గాబ్రియేల్ మాట్లాడుతూ భారత్ పర్యటన ద్వారా ఇరుదేశాల మధ్య బంధాలు మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉందని అన్నారు. పరస్పరం సాంస్కృతిక సహకారం అందించుకుంటామని అన్నారు. 'షూట్ ఇన్ చిలీ' ప్రోగ్రాం ద్వారా భారత చిత్రపరిశ్రమతో కలిసి పని చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఐదు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం దిల్లీకి వచ్చిన చిలీ అధ్యక్షుడు రాజ్ ఘాట్ వద్ద మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. అనంతరం హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో చర్చల్లో పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా ఆయన ఆగ్రా, ముంబయి, బెంగళూరుకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేయనున్న విందులో చిలీ అధ్యక్షుడు పాల్గొననున్నట్లు సమాచారం.






### అమ్మకాల్లో దేశీయ దిగ్గజం హవా

# భారీగా పెరిగిన సేల్స్

**దేశీయ వాహన తయారీ దిగ్గజం మహీంద్రా & మహీంద్రా 2025 మార్చి నెలలో మొత్తం అమ్మకాలను వెల్లడించింది. కంపెనీ గత నెలలో మొత్తం 83894 యూనిట్ల వాహనాలను విక్రయించింది. ఈ సంఖ్య 2024 మార్చి (68413 యూనిట్లు) కంటే 23 శాతం ఎక్కువ.**

కంపెనీ మొత్తం అమ్మకాలలో ప్యాసింజర్ వెహికల్ సేల్స్ 48,048 యూనిట్లు, కమర్షియల్ వాహనాల సేల్స్ 31,703 యూనిట్లుగా ఉన్నాయి. ఎగుమతులు 4143 యూనిట్లతో 163 శాతం వృద్ధిని నమోదు చేసింది. యుటిలిటీ వెహికల్స్ విభాగంలో, మహీంద్రా దేశీయ మార్కెట్లో 48048 వాహనాలను విక్రయించింది. 50835 వాహనాలను ఎగుమతి చేసింది.

కార్ల విక్రయాలు మాత్రమే కాకుండా.. ట్రాక్టర్ అమ్మకాల సంఖ్యను కూడా ప్రకటించింది. మార్చి 2025లో దేశీయ అమ్మకాలు 32,582 యూనిట్లుగా ఉన్నాయి. ఈ అమ్మకాలు మార్చి 2024లో 24,276 యూనిట్లుగా ఉన్నాయి. మొత్తం మీద మహీంద్రా కంపెనీ అమ్మకాలు 2024 మార్చి కంటే కూడా 2025 మార్చిలో గణనీయంగా పెరిగాయి.




### ఎస్‌బీఐ సేవల్లో అంతరాయం

# నిలిచిపోయిన ట్రాన్సాక్షన్స్

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్లు ఆన్‌లైన్ సేవలతో సమస్యలను ఎదుర్కొంటున్నారు. వెబ్‌సైట్ పర్ఫామెన్స్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డెటెక్టర్ ప్రకారం, ఈరోజు ఉదయం 8:15 గంటలకు ఈ అంతరాయం ప్రారంభమైంది. 11:45 గంటలకు సమస్య తీవ్రమై 800 కంటే ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి.**

వార్షిక ముగింపు కార్యకలాపాల కారణంగా.. ఏప్రిల్ 1 మధ్యాహ్నం 1:00 గంట నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో లైట్, యూపీఐ సేవల వంటి డిజిటల్ సర్వీసులు అందుబాటులో ఉండవని.. ఈ అంతరాయానికి క్షమించమని ఎస్‌బీఐ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది.

డౌన్‌డెటెక్టర్ ప్రకారం, సుమారు 64 శాతం మొబైల్ బ్యాంకింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులు, 33 లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ అంతరాయం నుంచి బయటపడటానికి కస్టమర్లు యూపీఐ లైట్, ఏటీఎమ్ ఉపయోగించుకోవచ్చని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది.

### నాలుగు లక్షల నెంబర్లు లీక్..

# రేపు ఒకరి అరెస్ట్ తప్పదు



**సోషల్ సెక్యూరిటీ డేటాబేస్ నుంచి నాలుగు లక్షల మంది వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి విక్రయించాడనే ఆరోపణలపై ఒక వ్యక్తిని త్వరలో అరెస్టు చేస్తామని ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత 'ఎలాన్ మస్క్' తెలిపారు. దీనికి సంబంధించిన ఒక ట్వీట్ కూడా నెట్టింట్లో వైరల్ అవుతోంది.**

సోషల్ సెక్యూరిటీ డేటాబేస్ నుంచి దొంగలించిన నాలుగు లక్షల నెంబర్లు, వ్యక్తిగత సమాచారం.. అక్రమ వలసలు, అమెరికా పౌరులు కానివారు ఓటు వేయడానికి అనుమతిస్తామని మస్క్ పేర్కొన్నారు. అంతే కాకుండా.. సామాజిక భద్రత, వైద్య సంరక్షణ, నిరుద్యోగ భృతి, ఐఆర్ఎస్ వాపసులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ, పత్రాలు లేని వలసదారులు ప్రయోజనాలను పొందడాన్ని డెమొక్రాట్లు సులభతరం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.విపత్తు సహాయానికి ఉద్దేశించిన నిధులు కూడా దుర్వినియోగం అయ్యాయని మస్క్ ఆరోపించారు. జాతీయ విపత్తుల వల్ల బాధపడుతున్న అమెరికన్లకు సహాయం చేయడానికి ఉద్దేశించిన ఎఫ్ఈఎమ్ఏ నిధులను దారి మళ్లించి, న్యూయార్క్‌లోని లగ్జరీ హోటళ్లకు అక్రమంగా నివసించేవారి కోసం చెల్లించడానికి ఉపయోగించారని అన్నారు.

## ఈ రూల్ అతిక్రమిస్తే..

# డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్!: నితిన్ గడ్కరీ

**ట్రాఫిక్ జరిమానాల రికవరీని వేగవంతంగా చేయడానికి.. కఠినమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగానే ట్రాఫిక్ ఈ-చలానాలు చెల్లించని వారి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేసే అవకాశం ఉంది.**

వాహనదారులు లేదా వాహన యజమానులు తన చలానాలను మూడు నెలల లోపల చెల్లించాలి. లేకుంటే.. కొత్త ముసాయిదా నిబంధనల ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేస్తారు. ఒక ఆర్థిక సంవత్సరంలో.. సిగ్నల్ జంప్ చేయడం లేదా ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ మూడు సార్లు చలానాలకు గురైతే.. వారి డ్రైవింగ్ లైసెన్స్ మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తారు.




వెహికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంలకు కూడా ట్రాఫిక్ ఈచలానాలతో అనుసంధానం చేయాలని ముసాయిదా నిబంధనలో వెల్లడించారు. కాబట్టి డ్రైవర్ ఒక ఆర్థిక సంవత్సరంలో.. రెండు లేదా అంతకంటే ఎక్కువ చలానాలు చెల్లించకుండా తప్పించుకుంటూంటే.. వారు ఎక్కువ ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.





### రోడ్డు ప్రమాదాలు

ప్రపంచంలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న దేశాల జాబితాలో భారత్ ఒకటిగా ఉంది. మన దేశంలో సుమారు 4,80,000 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ఇందులో 1,80,000 మంది మరణించగా.. 4,00,000 మంది తీవ్రంగా గాయపడ్డారని కేంద్ర రోడ్డు రవాణా & రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ఈ మరణాలలో 1,40,000 మంది 18 నుంచి 45 ఏళ్ల వయసున్నవారే అని ఆయన అన్నారు.

భారతదేశంలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటూ ఉంది. ఇందులో భాగంగానే.. జాతీయ రహదారులను విస్తరించడం, ట్రాఫిక్ నియమాలను కఠినతరం చేయడం వంటి వాటితో పాటు భారీ జరిమానాలు విధించడం వంటివి చేస్తోంది. ట్రాఫిక్ రూల్ అతిక్రమించి చలానాలు కట్టకుండా తప్పించుకునే వారిని కూడా వదిలిపెట్టకూడదనే ఉద్దేశ్యంతో.. కేంద్రం ఇప్పుడు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయనున్నట్లు ప్రకటించింది.

ఢిల్లీలో ట్రాఫిక్ చలాన్ల రికవరీ రేటు కేవలం 14 శాతం మాత్రమే. ఇది కర్ణాటకలో 21 శాతం, తమిళనాడు & ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 27 శాతంతో ఉన్నాయి. మహారాష్ట్ర, హర్యానాలో ట్రాఫిక్ చలాన్ రికవరీ రేట్లు వరుసగా 62, 76 శాతంగా ఉన్నాయి.

### భగ్గుమన్న బంగారం..

# ఒకేరోజు భారీగా పెరిగిన ధర

**స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధరలు ఇటీవల కొంత శాంతించినట్లు కనిపించినా తిరిగి జీవితకాల గరిష్టాలను చేరుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో మంగళవారం రోజున గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం.**



హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో ఒక తులం బంగారం ధరలు రూ.85,100 (22 క్యారెట్స్), రూ.92,840 (24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. సోమవారం ధరలతో పోలిస్తే ఈ రోజు 10 గ్రాముల బంగారం ధర వరుసగా రూ.850, రూ.930 పెరిగింది.

చెన్నైలో మంగళవారం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధరలు రూ.850, 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.930 పెరిగింది. దీంతో గోల్డ్ రేటు రూ.85,100 (22 క్యారెట్స్ 10 గ్రామ్స్ గోల్డ్), రూ.92,840 (24 క్యారెట్స్ 10 గ్రామ్ గోల్డ్)కు చేరింది.

దేశ రాజధాని నగరం దిల్లీలో బంగారం ధర నిన్నటితో పోలిస్తే పెరిగింది. ఈ రోజు 10 గ్రాముల 22 క్యారెట్స్ పసిడి ధర రూ.850 పెరిగి రూ.85,250కు చేరుకోగా..24 క్యారెట్ల ధర రూ.930 పెరిగి రూ.92,990 వద్దకు చేరింది.

### వెండి ధరలు

**బంగారం ధరలు పెరుగుతున్నట్లు వెండి ధరల్లోనూ మంగళవారం మార్పులు వచ్చాయి. నిన్నటితో పోలిస్తే ఈ రోజు వెండి ధరలు పెరిగాయి. కేజీ వెండి రేటు సోమవారంతో పోలిస్తే రూ.1000 పెరిగి రూ.1,14,000 వద్దకు చేరింది.**




### భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**మంగళవారం ఉదయం నష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ ముగిసే సమయానికి నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 1,307.27 పాయింట్లు లేదా 1.69 శాతం నష్టంతో.. 76,107.66 వద్ద, నిఫ్టీ 339.50 పాయింట్లు లేదా 1.44 శాతం నష్టంతో.. 23,179.85 వద్ద నిలిచాయి.**

కనాని ఇండస్ట్రీస్, హెస్టర్ బయోసైన్సెస్, రేడియంట్ క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, వోడాఫోన్ ఐడియా వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూసీఓ బ్యాంక్, వన్‌సోర్స్ స్పెషాలిటీ ఫార్మా, వైశాలి ఫార్మా, సిస్టమ్స్ ఇండియా మొదలైన కంపెనీలు నష్టాల జాబితాలో నిలిచాయి

# రతన్ టాటా వీలునామా: ఎవరికి ఎంత కేటాయించారంటే?

**ఒక మనిషి చనిపోయినా.. అతడు చేసిన మంచి ఎప్పుడూ బతికే ఉంటుంది. ఇలాంటి కోవకు చెందిన వారిలో చెప్పుకోదగ్గ వ్యక్తి, దివంగత పారిశ్రామికవేత్త 'రతన్ టాటా' ఒకరు. లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యానికి అధినేత అయినప్పటికీ.. లెక్కకు మించిన డబ్బును అనేక సేవా కార్యక్రమాల కోసం ఉదారంగా వెచ్చించారు. రతన్ టాటా మరణించిన తరువాత.. ఆయన ఆస్తులు, సంపద ఎవరికి చెందుతాయి? అనే ప్రశ్న.. ఒక ప్రశ్నగానే మిగిలిపోయింది. దానికి ఇప్పుడు సమాధానం లభించింది.**



టాటా సామ్రాజ్యాన్ని ప్రపంచంలోని చాలా దేశాలకు విస్తరించిన రతన్ టాటా ఆస్తి సుమారు రూ. 10వేలకోట్ల కంటే ఎక్కువ ఉంటుందని తెలుస్తోంది. ఇందులో సుమారు రూ.3800 కోట్ల సంపదను.. తాను నెలకొల్పిన రతన్ టాటా ఎండోమెంట్ ఫౌండేషన్, రతన్ టాటా ఎండోమెంట్ ట్రస్ట్ వంటి వాటికి కేటాయించారు.

తన సవతి సోదరీమణులైన శిరీన్ జజీభోయ్, దియానా జజీభోయ్ పేరుమీద రూ.800 కోట్లు రాసినట్లు తెలుస్తోంది. వీటికి కేటాయించిన ఆస్తులలో ఫిక్స్ డిపాజిట్లు, ఖరీదైన పెయింటింగ్స్, వాచ్‌లు వంటివి ఉన్నాయి. రతన్ టాటాకు సన్నిహితుడైన.. మోహిన్ ఎం దత్తాకు కూడా రూ.800 కోట్లు రాశారు.

జిమ్మీ నావల్ టాటాకు.. రతన్ టాటాకు చెందిన జుహూలోని బంగ్లాలో కొంత షేర్, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను కేటాయించారు. మెహిల్ మిస్త్రీ పేరు మీద అలీబాగ్‌లోని బంగ్లా, మూడు పిస్టోళ్లను కేటాయించారు.

**రతన్ టాటాకు కుక్కలంటే చాలా ఇష్టం. ఈ కారణంగానే శునకాల సంరక్షణ కోసం కూడా రూ. 12 లక్షల ఫండ్ కేటాయించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రూ. 30వేలు చొప్పున వాటికి ఖర్చుచేసే విధంగా నిధులను కేటాయించారు. రతన్ టాటాకు విదేశాల్లో కూడా రూ. 40 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. ఇవి కాకుండా ప్రముఖ కంపెనీలలో షేర్స్, ఖరీదైన 65 వాచీలు కూడా ఉన్నాయి.**

**ఇక అందరూ తెలుసుకోవాలనుకునే విషయం.. రతన్ టాటా యువ స్నేహితుడు శంతను నాయుడుకు ఏమి కేటాయించారు అని. అయితే శంతను నాయుడుకు తనవంతు సాయం చేసినట్లు తెలుస్తోంది. అది కాకుండా.. స్టూడెంట్ లోన్ మాఫీ చేశారు. ఇది కాకుండా రతన్ టాటా పక్కింట్లో ఉండే జేక్ మాలిటే అనే వ్యక్తికి అప్పుగా ఇచ్చిన రూ. 23 లక్షలు కూడా మాఫీ చేశారు.**




# బన్నీపై రూమర్స్.. నిజమేనా?

**సినిమా సెలబ్రిటీలపై ఎప్పటికప్పుడు రూమర్స్ వస్తూనే ఉంటాయి. ఇప్పుడు అలానే అల్లు అర్జున్ గురించి కొన్ని గాసిప్స్ వినిపిస్తున్నాయి. త్వరలో పేరు మార్చుకోబోతున్నాడని పలు ఇంగ్లీష్ వెబ్ సైట్లలో వార్తలు వస్తున్నాయి. ఇంతకీ ఇందులో నిజమెంత?**

పుష్ప 2 మూవీతో పాన్ ఇండియా లెవల్లో అల్లు అర్జున్ కి ఊహించని స్టార్ డమ్ వచ్చింది. దీంతో ఆచితూచి మూవీస్ చేస్తున్నాడు. ఇప్పటికే త్రివిక్రమ్ తో సినిమా కన్ఫర్మ్, అట్లీతో కూడా ఖరారైందని అంటున్నారు. పుట్టి నరోజున (ఏప్రిల్ 8న) అధికారిక ప్రకటన వస్తుందని సమాచారం.

ఇలా కొత్త సినిమా అనౌన్స్ మెంట్ ఎప్పుడొస్తుందా అని అభిమానులు మాట్లాడుకుంటున్న ఈ టైంలో బన్నీ పేరు మార్చుకోబోతున్నాడనే రూమర్స్ వినిపిస్తున్నాయి. సెల బ్రిటీలు జాతకాలు, న్యూమరాలజీ లాంటివి ఎక్కువగా నమ్ముతుంటారు. అలానే న్యూమరాలజీ ప్రకారం.. తన పేరులో అదనంగా ఇంగ్లీష్ అక్షరం U,N గానీ బన్నీ జోడించుకుంటాడని.. ఇలా చేస్తే గుర్తింపు మరింత పెరుగుతుందని నమ్మకమట.

మరి బన్నీ పేరు మార్పుపై వస్తున్న రూమర్స్ నిజమా కాదా కొత్త సినిమా ప్రకటిస్తే క్లారిటీ వచ్చేస్తుంది. ఎందుకంటే ఎప్పటిలానే పేరు ఉంటే ఓకే. లేదంటే మార్పు వార్తలు నిజమేనని తెలుతుంది.



# 'కన్నప్ప' సినిమా ప్రీమియర్.. అసలు నిజం ఇది

మంచు విష్ణు హీరో, నిర్మాతగా చేసిన లేటెస్ట్ మూవీ కన్నప్ప. లెక్క ప్రకారం ఏప్రిల్ 25న థియేటర్లలో రిలీజ్ చేస్తామని చాలారోజుల క్రితమే ప్రకటించారు. కొన్నిరోజుల క్రితం వరకు ప్రచారం చేశారు. కానీ వీఎఫ్ఎక్స్ పనుల వల్ల వాయిదా వేస్తున్నట్లు రీసెంట్ గా ప్రకటించారు. కానీ తాజాగా మూవీ ప్రీమియర్ వేశారనే రూమర్స్ రాగా.. టీమ్ దీనిపై స్పందించింది.

'మార్చి 31న కన్నప్ప ప్రీమియర్ వేశారని వస్తున్న వార్తల్లో నిజం లేదు. 15 నిమిషాల వీఎఫ్ఎక్స్ ఫుటేజీ క్వాలిటీ మాత్రమే చెక్ చేశాం. మూవీ ఫస్ట్ కాపీని రెడీ చేసే పనిలో బిజీగా ఉన్నాం. ఇలాంటి ఫేక్ వార్తలు నమ్మొద్దు. త్వరలోనే ఇతర వివరాలు ప్రకటిస్తాం' అని కన్నప్ప టీమ్ చెప్పుకొచ్చింది.

ప్రసాద్ ల్యాబ్ నుంచి మంచు ఫ్యామిలీ నడిచొస్తున్న విజువల్స్ కొన్ని బయటకు రావడంతోనే ఈ ప్రీమియర్ వార్తలు వచ్చాయి. ఇకపోతే కన్నప్ప మూవీలో మంచు ఫ్యామిలీకి చెందిన విష్ణు, ఇతడి కూతుళ్లుకొడుకు నటించారు. తండ్రి మోహన్ బాబు కూడా కీలక పాత్ర పోషించారు. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్ తదితరులు అతిథి పాత్రలు చేశారు.




# చిరంజీవి, అనిల్ 'మెగా157' నుంచి రఫ్ఫాడించే వీడియో విడుదల

**మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'మెగా157' నుంచి 'రఫ్ఫాడిద్దాం' పేరుతో ఒక వీడియోను విడుదల చేశారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా విడుదల సమయంలో వెంకటేష్‌తో అనిల్ చేసిన ప్రమోషన్స్ కార్యక్రమాలన్నీ కూడా ప్రేక్షకులను మెప్పించడమే కాకుండా సినిమాను ప్రతి ఇంటికి తీసుకెళ్లాయి. దీంతో ఈ ఏడాదిలో బ్లాక్ బస్టర్ కొట్టేశాడు. ఇప్పుడు ఆ ఫార్ములానే చిరంజీవి సినిమాకు ఇంకాస్త డిఫరెంట్‌గా అనిల్ ప్లాన్ చేస్తున్నాడు.**

సంక్రాంతి 2026లో రఫ్ఫాడిద్దాం పేరుతో ఒక వీడియోను అనిల్ రావిపూడి క్రియేట్ చేశాడు. మెగా 157 ప్రాజెక్ట్ కోసం పనిచేస్తున్న తన గ్యాంగ్ మొత్తాన్ని మెగాస్టార్ సినిమాలకు సంబంధించిన డైలాగ్స్‌తో చిరంజీవికి పరిచయం చేశాడు. డైరెక్షన్ టీమ్ నుంచి నిర్మాతల వరకు అందరినీ పరిచయం చేశారు. సుమారు రెండు నిమిషాలకు పైగా ఉన్న ఈ వీడియో చాలా ఫన్నీగా ఎంటర్‌టైన్ చేసేలా ఉంది. ఇదే వీడియోను చిరంజీవి కూడా తన సోషల్‌మీడియాలో షేర్ చేశారు. దర్శకుడు అనిల్ రావిపూడి ప్రేక్షకులను ఎలా ఎంటర్‌టైన్ చేయాలో బాగా తెలిసిన దర్శకుడు అంటూ ఆయన్ను చిరంజీవి ప్రశంసించారు. ఈ వీడియో చూసిన నెటిజన్లు అనిల్‌ను మెచ్చుకుంటూ కామెంట్లు చేస్తున్నారు. అనిల్ రావిపూడి తనదైన మార్క్‌తో అప్పుడే మొదలెట్టేశాడు రా బాబూ.. అంటూ ఫన్నీగా ట్వీట్లు చేస్తున్నారు.

సంక్రాంతికి వస్తున్నాం హిట్ తర్వాత అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. త్వరలో షూటింగ్ పనులు ప్రారంభం అవుతాయని మేకర్స్ తెలిపారు. ఈ సినిమా వినోదంతో పాటు బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఇందులో చిరంజీవి తన సొంత పేరైన శివ శంకర్ వరప్రసాద్ అనే పాత్రలో కనిపించనున్నారు. 2026 సంక్రాంతికి ఈ చిత్రం విడుదల కానుంది.



## అప్పుడు నాకు 17 ఏళ్లు.. దర్శకుడు చెప్పింది చేశా..

# నాన్న బాధ పడ్డారు: అమలాపాల్

**సాధారణంగా అందంతో పాటు విమర్శకుల ప్రశంసలు పొందేంత అభినయం కూడా ఉండడం అతి తక్కువ మంది హీరోయిన్లు మాత్రమే సాధించగలిగిన విజయం. అలాంటి విజయవంతమైన కథానాయికల్లో అమలాపాల్ ఒకరు. తమిళం, మలయాళం తెలుగు సినిమాలలో నటిస్తూ బహుభాషా నటిగా తన అందానికి, అభినయానికి సమాన ప్రశంసల్ని పొందిన ఈ నటి నిర్మాత కూడా. తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డుతో సహా ప్రతిష్టాత్మక అవార్డుల గ్రహీతగా అమల పాల్ పరిశ్రమలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. అయితే ఏమీ తెలీకుండా సినీ రంగంలోకి అడుగుపెట్టిన నాటి అమలాపాల్‌కి ప్రస్తుతం ఉన్న వ్యక్తికి చాలా తేడా ఉందని ఆమె అంటోంది.**

అమలా పాల్,నటిగా 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె తాను విజయాలు మాత్రమే కాదు మరెన్నో సవాళ్లతో నిండిన ప్రయాణాన్ని సాగించానని వెల్లడించింది..వ్యక్తిగత వృత్తి పరమైన ఎదుగుదలతో పాటు జీవితంలోని హెచ్చు తగ్గులు తన మార్గానికి ఒక రూపాన్ని ఇచ్చాయి అంటోంది. మళ్లీ ప్రేమ, మళ్లీ పెళ్లి, తల్లి కావడం... ఇలాంటి వ్యక్తిగత అనుభవాలను తన అభిమానులతో పంచుకుంటూ.. ఈ 15 సంవత్సరాలలో, ఆమె తన అనుభవాల ద్వారా ఎదురుదెబ్బల నుంచి చాలా నేర్చుకున్నానంది.

అమలాపాల్ 2010లో నటించిన తమిళ చిత్రం "సింధు సమవేలి" ఆమె కెరీర్ ను వ్యక్తిగత జీవితాన్ని సైతం ప్రభావితం చేసింది. ఆమె సింధు సమవేలిలో ఓ బోల్డ్ పాత్రను పోషించింది ఎందరినో ఇబ్బంది పెట్టిన శృంగార సన్నివేశాల్లో నటించింది. ఆ సాహసం ఆమె వ్యక్తిగత జీవితం ప్రారంభ కెరీర్ రెండింటినీ ఎదురుదెబ్బలు ఎదుర్కొనేలా చేసింది.

తండ్రి వయసు ఉండే తన మామగారితో అక్రమ సంబంధానికి ఒడిగట్టే కోడలు సుందరి పాత్రలో ఆమె నటించిన ఆ చిత్రం విడుదలైన తర్వాత తీవ్ర దుమారానికి దారితీసింది. ఈ వివాదం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ,.ఆ సినిమా విషయంలో వెల్లువెత్తిన ప్రతికూలత తనను బాగా భయపెట్టిందని, ముఖ్యంగా ఆ సినిమా చూసి తన తండ్రి తీవ్రంగా కలత చెందారని ఆమె వెల్లడించింది.

తన పాత్ర చూపించే సామాజిక ప్రభావాన్ని తాను అంచనా వేయలేకపోయానని అంగీకరించింది. 'మనం అలాంటి పాత్ర చేయకూడదని, అది చెడ్డదని లేదా అది మన సమాజం అంగీకరించే విషయం కాదని ఆ చిత్రం విడుదల తర్వాత మాత్రనే నేను అర్థం చేసుకోగలిగాను" అంటూ ఆమె గుర్తు చేసుకుంది.

అయితే అప్పుడు తాను కేవలం 17 లేదా 18 సంవత్సరాల వయస్సు మాత్రమే ఉన్న నటిని..కావడంతో దర్శకుడి సూచనలను గుడ్డిగా అనుసరించడం మాత్రమే చేయగలిగానంది. ఈ వివాదం ఆమెను మానసికంగా ప్రభావితం చేయడమే కాకుండా కెరీర్ పరంగానూ వ్యతిరేక పరిణామాలకు దారి తీసింది.

సింధు సమవేలి తరువాత, ఆమె తన తదుపరి చిత్రం మైనా ప్రారంభ ప్రమోషన్లలో సైతం దేనికీ ఆమెను పిలవలేదు, ఆ తర్వాత ఆమెకు తరువాత కమల్ హాసన్ రజనీకాంత్ వంటి దిగ్గజ నటుల నుంచి సైతం కాల్స్ వచ్చాయి, అయితే విపరీతమైన వ్యతిరేకత పట్ల భయం కారణంగా, ఆమె చెన్నైకి వెళ్లలేకపోయింది.

అమలాపాల్ సక్సెస్ తర్వాత ఆ వివాదాస్పద చిత్రం మరోసారి రీ-రిలీజ్ అయింది. అప్పుడు కూడా ప్రమోషనల్ మెటీరియల్ తప్పుదారి పట్టిస్తోందంటూ వివాదాన్ని రేకెత్తించింది. వీటన్నింటి నేపథ్యం "సినిమా కేవలం వ్యాపారాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకుంటుందని నేను గ్రహించాను, దీన్ని దృష్టిలో పెట్టుకుని ఒక నటి ఎదురు దెబ్బలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి' అని ఆమె స్పష్టం చేసింది.




# పూజ చేసి డ్యాన్స్ చేసిన మిల్కీ బ్యూటీ

**హీరోయిన్ తమన్నా ఇంట్లో మాతా కీ చౌకీ నిర్వహించారు. నవరాత్రుల్లో భాగంగా చేసే ఈ పూజ.. ఇప్పుడు తమన్నా ఇంట్లో జరిగింది. పూజ పూర్తయిన తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి తమన్నా సంప్రదాయ డ్యాన్స్ కూడా చేయడం విశేషం.**

**ఈ మొత్తం పూజకు సంబంధించిన వీడియోని తమన్నా తన ఇన్ స్టాలో పోస్ట్ చేసింది. ఈ వేడుకకు బాలీవుడ్ యువ నటి రషా తడానీ కూడా హాజరైంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కొన్నిరోజుల క్రితం విజయ్ వర్మతో తమన్నాకు బ్రేకప్ అయిందనే రూమర్స్ వినిపించాయి.**

**ఇప్పుడు తమన్నా ఇంట్లో చేసిన పూజ కార్యక్రమంలో విజయ్ కనిపించకపోవడంతో బ్రేకప్ పై ఫుల్ క్లారిటీ వచ్చేసినట్లే. సినిమాల విషయానికొస్తే ఓదెల 2 అనే తెలుగు సినిమాలో తమన్నా ప్రధాన పాత్ర పోషించింది.**



# పవర్ ప్లేలో అశ్విన్‌తో బౌలింగ్ చేయించకండి: భారత మాజీ క్రికెటర్

**వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమితో డీలాపడిన సీఎస్కేకు భారత మాజీ ఆటగాడు కృష్ణమాచారి శ్రీకాంత్ పలు సూచనలు చేశాడు.**

గతేడాది అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రవిచంద్రన్ అశ్విన్ .. ఈ ఐపీఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ కు ఆడుతున్నాడు. అశ్విన్ దాదాపు 12 ఏళ్ల తర్వాత తిరిగి సొంత గూటికి చేరుకున్నాడు. ఒకప్పుడు తన స్పిన్ మయాజాలంతో ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లకు చుక్కలు చూపించిన యాష్.. ఇప్పుడు పెద్దగా రాణించట్లేదు. భారీగా పరుగులు ఇవ్వడంతోపాటు వికెట్లూ తీయడం లేదు. మూడు మ్యాచ్‌ల్లో కలిపి 10 ఓవర్లు వేసిన అతను 9.90 ఎకానమీతో మూడు వికెట్లు తీశాడు. మరోవైపు, తొలి మ్యాచ్‌లో ముంబయిపై గెలిచిన చెన్నై.. తర్వాత రెండు మ్యాచ్‌ల్లో ఓడింది. ఈ నేపథ్యంలో సీఎస్కేకు భారత మాజీ ఆటగాడు కృష్ణమాచారి శ్రీకాంత్ పలు సూచనలు చేశాడు. పవర్ ప్లేలో అశ్విన్‌తో బౌలింగ్ చేయించొద్దని సూచించాడు. జట్టులో కొన్ని మార్పులు చేస్తే జట్టు తిరిగి గాడిలో పడుతుందన్నాడు.

'అశ్విన్‌ను ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తప్పించొద్దు. కానీ, పవర్ ప్లేలో అతడితో బౌలింగ్ చేయించడం ఆపండి. రవీంద్ర జడేజా, నూర్ అహ్మద్‌తో కలిసి 718 ఓవర్ల మధ్య అశ్విన్ ప్రభావం చూపించగలడు. రాహుల్ త్రిపాఠిని తప్పించి అన్షుల్ కాంబోజ్‌కు అవకాశం ఇవ్వాలి. ఒవర్టన్ స్థానంలో డేవాన్ కాన్వేను తుది జట్టులోకి తీసుకోవాలి. శివమ్ దూబె ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉండాలి. ఆండ్రీ సిద్ధార్థ్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడించాలి. పేసర్ ముకేశ్ చౌదరి కూడా మంచి ఆప్షన్. అతను గతంలో సీఎస్కే తరఫున బాగా బౌలింగ్ చేశాడు' అని కృష్ణమాచారి శ్రీకాంత్ వివరించాడు. చెన్నై తదుపరి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. ఏప్రిల్ 5న చెపాక్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది.



## ఈ మాత్రం ఆటకేనా రూ. 27 కోట్లు..
# పంత్‌పై నెటిజన్లు ఫైర్

**ఐపీఎల్-2025లో టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్, లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ తన పేలవ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. వరుసగా మూడు మ్యాచ్‌లోనూ పంత్ విఫలమయ్యాడు. ఈ మెగా టోర్నీలో భాగంగా లక్నో వేదికగా పంజాబ్ కింగ్‌స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంత్ దారుణ ప్రదర్శన కనబరిచాడు.**

కీలక సమయంలో క్రీజులోకి వచ్చిన రిషబ్.. 5 బంతులు ఎదుర్కొని కేవలం రెండు పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. గ్లెన్ మాక్స్‌వెల్ బౌలింగ్‌లో చాహల్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఇప్పటివరకు ఈ సీజన్‌లో మూడు మ్యాచ్‌లు ఆడిన పంత్ కేవలం 15 పరుగులు మాత్రమే చేశాడు.

ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ఖరీదైన ఆటగాడిగా నిలిచిన రిషబ్ పంత్ ఆట తీరుపై నెటిజన్లు మండిపడుతున్నారు. సోషల్ మీడియాలో పంత్‌ను దారుణంగా ట్రోలు చేస్తున్నారు. నీకంటే రూ. 30 లక్షల తీసుకున్న యువ ఆటగాళ్లు ఎంతో బెటర్ అని పోస్టులు పెడుతున్నారు. కాగా గతేడాది జరిగిన మెగా వేలంలో రూ. 27 కోట్ల రికార్డు ధరకు పంత్‌ను లక్నో కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది.

**తుది జట్లు**

పంజాబ్ కింగ్స్ (ప్లేయింగ్ XI): ప్రియాంష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), శశాంక్ సింగ్, మార్కస్ స్టోయినిస్, గ్లెన్ మాక్స్‌వెల్, సూర్యాంశ్ షెడ్జ్, మార్కో జాన్సెన్, లాకీ ఫెర్గూసన్, యుజ్వేంద్ర చాహల్, అర్ష్‌దీప్ సింగ్.

లక్నో సూపర్ జెయింట్స్ ప్లేయింగ్ XI: మిచెల్ మార్ష్, ఐడెన్ మార్క్‌రామ్, నికోలస్ పూరన్, రిషబ్ పంత్ (కెప్టెన్), ఆయుష్ బదోని, డేవిడ్ మిల్లర్, అబ్దుల్ సమద్, శార్దూల్ ఠాకూర్, అవేష్ ఖాన్, దిగ్వేష్ సింగ్ రాఠీ, రవి బిష్ణోయ్.

# ఒంటి కాలితో సాధించింది

**గూడూరు:** ప్రతిభకు పేదరికం.. అంగవైకల్యం అడ్డు కాదని నిరూపించింది ఓ యువతి. చిన్నప్పటి నుంచి ఆట, పాటలు, క్రీడలపై మక్కువ పెంచుకొని రాణిస్తోంది. దివ్యాంగురాలైనా పారా త్రోబాల్ క్రీడలో అత్యంత ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. గతేడాది కాంబోడియాలో జరిగిన అంతర్జాతీయ పారా త్రోబాల్ క్రీడలో దేశం తరఫున పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని గొల్లగూడెంకు చెందిన దయ్యాల కొమురయ్య, కొమురమ్మ కూతురు భాగ్య.




**ఒకే కాలుతో పుట్టి..**

కొమురయ్య, కొమురమ్మలది పేద కుటుంబం. వారికి కొడుకు, కూతురు భాగ్య ఉన్నారు. భాగ్య ఒంటికాలుతో పుట్టింది. తల్లిదండ్రులు అల్లారు ముద్దుగా పెంచారు. ఆమెకు పాటలు పాడటం, డ్యాన్స్ చేయడమంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. దీంతో డిగ్రీ పూర్తయిన తర్వాత ప్రస్తుతం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జానపద కళల్లో ఎంఏ చేస్తోంది. ఫోకో ఆర్ట్స్ కోర్సులో భాగంగా డప్పు, జానపద గేయాలు, కర్రసాము, చెక్కభజన వంటి తెలంగాణ సంప్రదాయ కళలను నేర్చుకుంది. బతుకమ్మ పాటలను సేకరించి పాడటం అలవాటుగా మార్చుకుంది.

# లఖ్‌నవూను చిత్తుచేసిన పంజాబ్ కింగ్స్

**ఐపీఎల్ 18లో పంజాబ్ కింగ్స్ రెండో విజయం సాధించింది. లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌లో ఆజట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొందింది.**

**లఖ్‌నవూ:** ఐపీఎల్ 18లో పంజాబ్ కింగ్స్ వరుసగా రెండో విజయం సాధించింది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 16.2 ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (69; 34 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (52*; 30 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ శతకాలతో అదరగొట్టారు. శ్రేయస్ సిక్స్ కొట్టి మ్యాచ్‌ను ముగించడంతోపాటు అర్ధ శతకం అందుకున్నాడు. నేహల్ వధేరా (42*; 25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. లఖ్‌నవూ బౌలర్లలో దిగ్వేశ్ రాఠీ (2/30) రాణించగా.. మిగతా బౌలర్లు తేలిపోయారు.



**తొలుత లఖ్‌నవూ బ్యాటర్లలో నికోలస్ పూరన్ (44; 30 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆయుష్ బదోని (41; 33 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించారు. మార్‌క్రమ్ (28), అబ్దుల్ సమద్ (27), డేవిడ్ మిల్లర్ (19) రన్స్ చేశారు. మిచెల్ మార్ష్ (0), రిషభ్ పంత్ (2) నిరాశపర్చారు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3, ఫెర్గూసన్, మ్యాక్స్‌వెల్, మార్కో యాన్సెన్, చాహల్ తలో వికెట్ పడగొట్టారు.**

# సద్దుమణిగిన హెచ్‌సీఎసన్‌రైజర్స్ వివాదం

**ఉప్పల్ స్టేడియంలో కాంప్లిమెంటరీ టికెట్ల వివాదంపై హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ప్రతినిధులు మంగళవారం భేటీ అయ్యారు.**

**హైదరాబాద్:** ఉప్పల్ స్టేడియంలో కాంప్లిమెంటరీ టికెట్ల వివాదంపై హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ప్రతినిధులు మంగళవారం భేటీ అయ్యారు. ఒప్పందం ప్రకారం పదిశాతం టికెట్లు ఇస్తామని ఎస్ఆర్‌హెచ్ స్పష్టం చేసింది. గతంలోలా అన్ని కేటగిరిల్లో పాసులు కేటాయించాలని హెచ్‌సీఏ కోరింది. దీనిపై ఎస్ఆర్‌హెచ్ సీఈవో షణ్ముగంతో ఇరు వర్గాల ప్రతినిధులు ఫోన్‌లో మాట్లాడారు. హెచ్‌సీఏకు కేటాయించే టికెట్లు యథావిధిగా కొనసాగుతాయని షణ్ముగం వెల్లడించారు. ఈ భేటీతో టికెట్లపై వివాదం సద్దుమణిగినట్లు తెలుస్తోంది.

# 'అప్పుడు రూ.30 అడిగేవాడు... ఇప్పుడు రూ.30లక్షలు దక్కించుకున్నాడు'

**ముంబయి ఇండియన్స్ తరఫున మరో పేస్ సంచలనం క్రికెట్ ప్రపంచానికి పరిచయమయ్యాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన తన తొలి మ్యాచ్‌లోనే అశ్వని కుమార్ 4 వికెట్లు కూల్చి రికార్డు సృష్టించాడు.**

ముంబయి ఇండియన్స్ తరఫున మరో పేస్ సంచలనం క్రికెట్ ప్రపంచానికి పరిచయమయ్యాడు. మొహాలికి చెందిన అశ్వనికుమార్ ఐపీఎల్‌లో అదిరిపోయే అరంగేట్రం చేశాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్ తో జరిగిన తన తొలి మ్యాచ్‌లోనే 3 ఓవర్లు బౌలింగ్ వేసి.. 24 పరుగులు ఇచ్చి, 4 వికెట్లు కూల్చి రికార్డు సృష్టించాడు. కోల్‌కతా నడ్డి విరిచి 116 పరుగులకే ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఆడిన తొలి మ్యాచ్‌తోనే అదరగొట్టిన అశ్వని కుమార్‌ను ముంబయి ఇండియన్స్ యాజమాన్యం ఇటీవలే ఐపీఎల్ వేలంలో రూ.30 లక్షలకు దక్కించుకుంది.



ఈ సందర్భంగా అశ్వని కుమార్ నాన్న హర్కేశ్ కుమార్ మీడియాతో మాట్లాడాడు. 'నా కుమారుడికి క్రికెటంటే ప్రాణం. ఎప్పటికప్పుడు తన నైపుణ్యం పెంచుకునేందుకు పరితపించేవాడు. ఎండనక, వాననక శ్రమించేవాడు. శిక్షణకు అస్సలు డుమ్మా కొట్టేవాడు కాదు. ట్రైనింగ్ ముగించుకుని ఎప్పుడో రాత్రి పదిగంటలకు ఇంటికి వచ్చి, తిరిగి ఉదయాన్నే అయిదుగంటలకు క్రికెట్ అకాడమీలో ఉండేవాడు. కొన్నిసార్లు సైకిల్ మీద కూడా అంతదూరం వెళ్లేవాడు. మరి కొన్ని సందర్భాల్లో షేర్‌ఆటోలో వెళ్లేందుకు రూ.30 నన్ను అడిగేవాడు. అలాంటి అశ్వని కుమార్‌ను ముంబయి ఇండియన్స్ రూ.30 లక్షలకు వేలంలో దక్కించుకుంది. తాను తీసుకున్న ప్రతిపైసాకూ అతడు న్యాయం చేశాడు. మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేసి వికెట్లు పడగొట్టి, ముంబయి విజయానికి కృషి చేశాడు' అని హర్కేశ్ కుమార్ ఆనందం వ్యక్తం చేశాడు.

**'అశ్వని కుమార్‌కు క్రికెట్లో జస్ప్రీత్ బుమ్రా , మిచెల్‌స్టార్క్ ఆదర్శం. వాళ్లలాగే బౌలింగ్‌లో రాణించాలని కలలు కనేవాడు. ఐపీఎల్‌లోకి రాక ముందు స్నేహితులు అతడికి బాల్స్ కొనిచ్చి సాయం చేశారు. ఎప్పుడైతే ఐపీఎల్ మెగా వేలంలో రూ.30 లక్షలు దక్కించుకున్నాడో అప్పుడు వెంటనే మాకు చుట్టుపక్కల ఉండే అకాడమీలకు క్రికెట్ కిట్లు, బంతులను విరాళంగా ఇచ్చాడు. తన పేరున్న జెర్సీ వేసుకునేందుకు అశ్వని కలలు కనేవాడు. ఇప్పుడు అతని పేరున్న జెర్సీ వేసుకునేందుకు పిల్లలంతా తప్పకుండా ఆసక్తి చూపుతారు' అని అశ్వని కుమార్ సోదరుడు శివ్‌రానా అన్నాడు.**

## విరాట్, రోహిత్ A+లోనే
# కొనసాగే అవకాశం!

**విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టీ20 వరల్డ్‌కప్ విజయం తర్వాత పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ త్వరలో విడుదల చేయనున్న బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టు జాబితాలో వీరిని A+ గ్రేడ్‌లోనే కొనసాగించనున్నట్లు సమాచారం!**



టీమ్‌ఇండియా దిగ్గజాలైన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టీ20 వరల్డ్‌కప్ 2024 విజయం తర్వాత పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్వరలో ప్రకటించనున్న బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టు జాబితాలో వారు A+ నుంచి A గ్రేడ్‌కు వస్తారని క్రీడా వర్గాలు ఊహిస్తున్నాయి. టెస్టు, వన్డే, టీ20 ఈ మూడు ఫార్మాట్లలో ప్రాతినిధ్యం వహిస్తూ రాణిస్తున్న వారికే బీసీసీఐ నుంచి A+ కాంట్రాక్టు దక్కే అవకాశముంది. కానీ మేటి క్రికెటర్లైన రోహిత్, కోహ్లీకి అదే గ్రేడ్ కొనసాగించి బీసీసీఐ గౌరవించనున్నట్లు తెలుస్తోంది!

గతంలో దేశవాళీ క్రికెట్ లో ఆడని కారణంగా శ్రేయస్ అయ్యర్ బీసీసీఐ ఆగ్రహానికి గురయ్యాడు. దీంతో సెంట్రల్ కాంట్రాక్టు జాబితా నుంచి తన స్థానం కోల్పోయాడు. ఈ సీజన్‌లో ముంబై తరఫున రంజీల్లో శ్రేయస్ సత్తా చాటాడు. అయిదు మ్యాచుల్లో 68.57 యావరేజ్, 90.22 స్ట్రైక్ రేట్‌తో 480 పరుగులు చేశాడు. అలాగే సయ్యద్‌ముస్తాక్ అలీ ట్రోఫీలో తొమ్మిది మ్యాచుల్లో 345 పరుగులు రాబట్టాడు. విజయ్‌హజారే ట్రోఫీలో అయిదు మ్యాచుల్లో 325 రన్స్ చేసి రాణించాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలోనూ 243 పరుగులతో భారత జట్టు తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. టీమ్‌ఇండియా టోర్నీ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో అతడికి కూడా జాబితాలో చోటు దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**'రోహిత్, విరాట్ కోహ్లీ A+ గ్రేడ్‌లోనే కొనసాగుతారు. వారు 7 ఏడుకోట్ల రూపాయల వార్షిక ప్యాకేజీని పొందుతారు. వారు టీ20 ఫార్మాట్ నుంచి రిటైర్ అయినా సరే వారి గ్రేడ్ తగ్గదు. వారు టీమ్‌ఇండియా కోసం ఎంతో కృషి చేశారు. ఎన్నో విజయాలందించారు. కాంట్రాక్టులో అదే గ్రేడ్ కొనసాగించి క్రికెట్ బోర్డు వారిని గౌరవించాలనుకుంటోంది. శ్రేయస్ అయ్యర్ కూడా తిరిగి సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలోకి రానున్నాడు' అని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి.**